## సమస్యలను పరిష్కరించాలి..

**- ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా**



పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

నార్నూర్, ఫిబ్రవరి 14 : నార్నూర్ మండల పరిధిలోని ముఖ్యమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, అభివృద్ధికి కసరత్తు చేయాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆయా మండల శాఖ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. నీతి ఆయోగ్‌లో నార్నూర్ మండలం ఎంపికైన నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం పల్లె ప్రకృతి వనంతోపాటు సామాజిక ఆరోగ్య కేంద్రం, గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలికల పాఠశాలను సందర్శించారు. ఆమె వెంట ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, ఏటీడీవో క్రాంతికుమార్, ఎంపీడీవో జవహర్ లాల్ పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల ఆందోళన



కార్మిక నాయకులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 : మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆదిలాబాద్ నూతన మున్సిపల్ కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, కమిషనర్ శైలజలు నాయకులతో మాట్లాడారు. పట్టణంలో ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు ప్రక్రియ కొనసాగుతున్నదని, రాగానే చెల్లింపులు చేపడుతామని హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.



నాగోబా దర్శనానికి బారులు తీరిన భక్తులు

# గిరిజన జాతర

- నాగోబాను దర్శించుకున్న 3.60 లక్షల మంది భక్తులు
- విరాళాల సేకరణ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు
- పంచాయతీ, వైద్య శాఖ ఆధ్వర్యంలో భక్తులకు సేవలు



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు



జాతరలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 14 ః ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబాను దర్శించుకోవడానికి భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసి పోయాయి. బుధవారం ఆయా ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా వచ్చారు. జాతర ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు 3.60 లక్షల మంది నాగోబాను దర్శించుకున్నట్లు ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు. దుకాణాలతోపాటు రంగు రాట్నాల వద్ద రద్దీ నెలకున్నది. ఆలయ అభివృద్ధికి మెస్రం వంశీయుల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భక్తులతోపాటు వ్యాపారస్తులకు వైద్య సేవలను అందిస్తున్నారు. పారిశుధ్య ఏర్పాట్లను డీపీవో శ్రీనివాస్, డీఎల్‌పీవో భిక్షపతి గౌడ్, ఐటీడీఏ శాఖకు చెందిన అధికారులు పరిశీలిస్తున్నారు. పోలీసు, ఐటీడీఏ శాఖలు, నాగోబా యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్ ఆటల పోటీలను నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొని ఆటలాడుతున్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులను అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా.. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు.

# వసంతోత్సవం

**బాసరలో వైభవంగా వసంత పంచమి వేడుకలు**

- రికార్డుస్థాయిలో అక్షర శ్రీకారాలు
- ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ
- భక్తులకు సరైన ఏర్పాట్లు చేయని అధికార యంత్రాంగం
- అక్షరాభ్యాసానికి దాదాపు ఎనిమిది గంటల సమయం
- క్యూలైన్‌లలో బారులుదీరిన భక్తజనం
- అమ్మవారిని దర్శించుకున్న 70 వేలకు పైగా భక్తులు



అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్, ఎమ్మెల్సీ విఠల్, ఎంపీ బాపురావ్



అక్షరాభ్యాస మండపంలో కూర్చున్న భక్తులు

బాసర, ఫిబ్రవరి 14 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో వసంత పంచమి వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం వసంత పంచమిని పురస్కరించుకుని భారీగా భక్తులు తరలివచ్చారు. వేకువ జామున మూడు గంటల నుంచే అమ్మవారి దర్శనంతోపాటు చిన్నారుల అక్షరాభ్యాసానికి బారులుదీరారు. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు భారీగా తరలి వచ్చారు. ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు.

### ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణ

రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ ఆర్‌జేసీ జ్యోతి, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే రామారావు పటేల్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌లు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు అమ్మవారి ప్రతిమలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండ ముథోల్ సీఐ మల్లేశ్, బాసర ఎస్సై గణేశ్, మరో ఆరుగురు ఎస్సైలు, దాదాపు 400 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతోపాటు బాసర గ్రామస్తులు, సేవా సమితి సభ్యులు చిన్నపిల్లలు, భక్తులకు తాగునీరు, పాలు, బిస్కెట్స్‌ను అందజేశారు.

### భారీగా అక్షరాభ్యాసాలు

వసంత పంచమి సందర్భంగా ఆలయ చరిత్రలోనే రికార్డుస్థాయిలో అక్షర శ్రీకారాలు జరిగాయి. రూ.1000 అక్షరాభ్యాసాలు 3735, రూ.150 అక్షరాభ్యాసాలు 3911 మొత్తం 7646 జరిగాయి. ఆర్జిత సేవలు, ప్రసాద విక్రయాల ద్వారా అమ్మవారికి రూ. 62 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు.

### ఏర్పాట్లు చేయని అధికారులు

అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు క్యూలైన్స్ మినహా ఏర్పాట్లు చేయలేదు. ఉదయం 3 గంటల నుంచి అక్షరాభ్యాసాలు ప్రారంభం కాగా.. దాదాపు రెండు గంటలు మాత్రమే క్యూలైన్‌లలో భక్తులకు పాలు, బిస్కెట్స్ అందజేశారు. దీంతో భక్తులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు ఆకలితో అలమటించి క్యూలైన్‌లలోనే ఏడ్చారు. కొందరు భక్తులు క్యూలైన్ నుంచి బయటకు రాలేక అక్కడే కూర్చుండిపోయారు. దాదాపు దర్శనానికి 6 నుంచి 8 గంటల సమయం పట్టింది. దేవస్థాన సిబ్బంది భక్తులకు సేవలు ఏర్పాటు చేయలేదు. ఈవో కార్యాలయంలో కూడా కనిపించలేదు. కొందరు భక్తులు అక్షరాభ్యాసం, దర్శనం చేసుకోకుండానే వెనుదిరిగారు. భక్తుల రద్దీని ముందే ఊహించినప్పటికీ తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో బాసర గ్రామస్తులు ఎంపీ బాపురావ్ ముందు తమ గోడును వెల్లబోసుకున్నారు.

### హాజరు కాని దేవాదాయశాఖ మంత్రి

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక గత ప్రభుత్వం యేటా వసంత పంచమికి దేవాదాయ శాఖ తరపున అప్పటి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హాజరై పట్టు వస్త్రాలను సమర్పించేవారు. కానీ.. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న కొండా సురేఖ పట్టు వస్త్రాలను సమర్పించడానికి రాకపోవడంతో భక్తులు, జిల్లా వాసులు నిరాశకు గురయ్యారు.



దర్శనం కోసం ఆలయ ఆవరణలో క్యూలో నిల్చున్న భక్తులు



తమ పిల్లలకు అక్షర శ్రీకారాలు చేయిస్తున్న తల్లిదండ్రులు



అమ్మవారి దర్శనం కోసం ఆలయం బయట భక్తుల రద్దీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రవాణ శాఖ అధికారి మనోహర్

## ప్రమాదాల్లో యువకులే అధికంగా చనిపోతున్నారు..

**ఆదిలాబాద్ జిల్లా రవాణ శాఖ అధికారి మనోహర్**

ఎదులాపురం, ఫిబ్రవరి 14 : రోడ్డు ప్రమాదాల్లో చిన్న చిన్న తప్పిదాల వల్ల యువకులు మృత్యువాత పడుతున్నారని జిల్లా రవాణ శాఖ అధికారి మనోహర్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాఠశాలల, కళాశాలల బస్సు డ్రైవర్లతోపాటు యువకులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. యేటా ఐదు లక్షల వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇందులో 1.50 లక్షల మంది చనిపోతున్నారని గుర్తు చేశారు. ఇందులో యువకులే అధికంగా ఉంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎంవీఐలు మహేశ్, సురేశ్, ట్రాఫిక్ సీఐ ప్రణయ్‌కుమార్ ఉన్నారు.

## ఎన్నికలప్పుడే గుర్తొచ్చామా?

- మేం కష్టపడితేనే కదా మీరు గెలిచింది..
- మాకు ఏం న్యాయం చేశారని ఆగ్రహం
- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావ్‌ను నిలదీసిన కార్యకర్తలు

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 14 : పట్టణంలో నిర్వహించిన బీజేపీ పార్లమెంట్ ఎన్నికల సమావేశం బుధవారం గరంగరంగా సాగింది. పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించగా.. పలువురు నాయకులు, సీనియర్ కార్యకర్తలు ఎంపీ సోయం బాపురావును నిలదీశారు. ఎంపీ మాట్లాడుతుండగా పార్టీలో ఏండ్లుగా పని చేస్తున్నా తమకు గుర్తింపు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. మీరు గెలిచిన తర్వాత మమ్ముల్ని పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్ళీ ఎన్నికలు వస్తుండడంతో సమావేశాలు పెట్టడం ఎంత వరకు సమంజసమని లేచి నిలదీశారు. కింది స్థాయిలో మేం కష్టపడితేనే గదా.. మీరు గెలిచింద్రు. మాకు ఎం న్యాయం చేశారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఒక నాయకుడు తెలిపాడు. ఇక నుంచి ఇలా చేస్తే మేం ఏం పని చేస్తాం.. అంటూ గరం అయినట్లు చెప్పారు. ఎంపీ కలుగజేసుకుని తప్పకుండా కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సైనికుల త్యాగాలను స్మరించుకోవాలి..

**మాజీ మంత్రి జోగు రామన్న**

ఎదులాపురం, ఫిబ్రవరి 14 : దేశ రక్షణ కోసం సైనికులు ప్రాణాలను త్యాగం చేస్తున్నారని, వారి ని ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న స్పష్టం చేశారు. బుధవారం సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్గిల్ పార్కులోని అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలా గే కొవ్వొత్తులు వెలిగించి వారి ఆత్మకు శాంతి చే కూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా రామ న్న మాట్లాడుతూ.. పుల్వామ దాడిలో 43 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణత్యాగం చేసి దేశ సార్వ భౌమత్వాన్ని నెలబెట్టారన్నారు. అనంతరం పట్టణానికి చెందిన అమరుడైన రవి భార్య స్వప్నను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సమితి అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ ఖత్రి, సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్, కెప్టెన్ మజార్, ఉత్సవ సమితి సభ్యులు పడకంటి సూర్యకాంత్, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అమరుడి భార్య స్వప్నను సన్మానిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## మూడు రోజుల్లో పెండ్లి..

- విద్యుత్ షాక్‌కు గురై యువకుడి మృత్యువాత
- చిన్న బెల్లాల్‌లో విషాదఛాయలు



మృతుడు వినోద్(ఫైల్)

కడెం, ఫిబ్రవరి 14 : మండలంలోని చిన్న బెల్లాల్‌లో బుధవారం పెండ్లింట విషాదం చోటు చేసుకున్నది. మరో మూడు రోజుల్లో వివాహం కావాల్సిన యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న బెల్లాల్‌కు చెందిన మీరాల వినోద్(25) బుధవారం మధ్యాహ్నం స్నానం చేయడానికి బాత్రూంకు వెళ్లాడు. గీజర్‌ను ఆన్ చేయగా నీటితోపాటు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వినోద్‌ను ఖానాపూర్ దవాఖానకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. కాగా.. మీరాల కళవ్వ-నీలయ్య దంపతులకు ముగ్గురు కుమారులు. కాగా, చిన్న కుమారుడైన వినోద్ ఉపాధి నిమిత్తం ఇరాక్ వెళ్లి, నెల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. ఇతనికి జగిత్యాల జిల్లాకు చెందిన అమ్మాయితో ఈనెల 18వ తేదీన వివాహం నిశ్చయించారు. ఇంతలోనే విషాదం చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పెండ్లి కొడుకు కాక ముందే మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.



జడ్పీ సీఈవో గోవింద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

## జడ్పీ సీఈవో బాధ్యతల స్వీకరణ

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 14 : నిర్మల్ జడ్పీ సీఈవోగా బుధవారం గోవింద్ బాధ్యతలను స్వీకరించారు. జడ్పీ కార్యాలయంలో విధుల్లో చేరిన ఆయనకు ఉద్యోగులు పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో శంకర్, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.




కనువిందు చేస్తున్న నిర్మల్ మండలం న్యూ పోచంపాడ్ గ్రామంలోని ప్రకృతి వనం




ఖానాపూర్ మండలం సుర్జాపూర్‌లో రాలిన ఆకులు, చెత్తా చెదారంతో పల్లె ప్రకృతి వనం

# పల్లె ప్రగతిపై నీలినీడలు

- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మారిన పల్లెల రూపురేఖలు
- పచ్చదనం, పరిశుభ్రతకు కేరాఫ్‌గా నిలిచిన గ్రామాలు
- నిర్మల్ జిల్లాకు ఆరేళ్లలో రూ.308.31 కోట్లు విడుదల
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై పల్లె జనం అసంతృప్తి

నిర్మల్, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ) : స్వరాష్ట్రంలో పల్లెలు పచ్చగా, పరిశుభ్రంగా ఉండాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టింది. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం, ఊరికో పల్లె ప్రకృతి వనం, మండలానికో బృహత్ ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసింది. పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించడం, ఈ చెత్తను డంప్ యార్డులకు తరలించడంతో గ్రామాలు పరిశుభ్రంగా మారాయి. వీటికి తోడు పంచాయతీకో ట్రాక్టర్, ట్యాంకర్‌ను ఇచ్చింది. జిల్లాలోని 396 పంచాయతీలకు 2017 జూన్ నుంచి 2023 నవంబర్ వరకు రూ.308.31 కోట్లు ఖర్చు చేసింది. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ కింద రూ.159.35 కోట్లు, సెంట్రల్ ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా రూ. 148.96 కోట్లు విడుదలయ్యాయి. వీటితో గ్రామాల రూపురేఖలే మారిపోయాయి.

### ఉమ్మడి రాష్ట్రంలో అధ్వాన్నంగా పల్లెలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉమ్మడి రాష్ట్రంలో పల్లెలు అధ్వాన్నంగా ఉండేవి. గుంతల రహదారులు, వీటిలోనే మురుగు నీరు, ఇందులోనే మంచినీటి పైపులు, వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, పాడు బడిన బావులు దర్శనమిచ్చేవి. కూలిన ఇండ్లు, అస్తవ్యస్తమైన మురుగునీటి గుంతల్లో దోమలు, ఈగలు, ఇతర కీటకాలతో పల్లెజనం మంచం పట్టేది. పల్లెల్లో పని చేయాలంటే నయా పైసా ఉండేది కాదు. కానీ.. స్వరాష్ట్రంలో పదేండ్లుగా ప్రతి పంచాయతీకి జనాభా ప్రాతిపదికన నిధులు విడుదలయ్యాయి. కాగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతి కొనసాగుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు కూడా ఖజానా ఖాళీ అంటుండడంతో పల్లె ప్రగతికి నిధుల విడుదలపై నీలినీడలు కమ్ముకున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా పంచాయతీలకు నయాపైసా ఇవ్వలేదు. కేవలం పేర్లు మార్చడం తప్పా అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు జరపకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు పునరావృతం అయ్యే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే రేవంత్ సర్కారు కూడా పల్లెల ప్రగతికి నిధులను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

**ఎస్ఎఫ్‌సీ నిధులు**

| సంవత్సరం | నిధులు |
|---|---|
| 2017-18 | రూ.7.12 కోట్లు |
| 2018-19 | రూ.14.18 కోట్లు |
| 2019-20 | రూ.25.26 కోట్లు |
| 2020-21 | రూ.45.55 కోట్లు |
| 2021-22 | రూ.36.09 కోట్లు |
| 2022-23 | రూ.31.15 కోట్లు |

**సీఎఫ్‌సీ నిధులు**

| సంవత్సరం | నిధులు |
|---|---|
| 2017-18 | రూ.14.09 కోట్లు |
| 2018-19 | రూ.16.44 కోట్లు |
| 2019-20 | రూ.31.33 కోట్లు |
| 2020-21 | రూ.32.99 కోట్లు |
| 2021-22 | రూ.36.18 కోట్లు |
| 2022-23 | రూ.17.93 కోట్లు |

